## క్లుప్తంగా

### చదువు సమానత్వానికి ముఖ్య భూమిక



సభలో మాట్లాడుతున్న మెండెం సంతోష్ కుమార్

**ఏలూరు(టూటౌన్):** సమానత్వానికి చదువు ముఖ్య భూమిక పోషిస్తుందని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ కొనియాడారు. మంగళవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు అధ్యక్షతన స్థానిక కార్యాలయంలో సభ నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు యూవీ, నేతల రమేష్, మేతర అజయ్, కేవీ రత్నం పాల్గొన్నారు.

### భక్తుల డేటా చోరీని అరికట్టాలి

**ఏలూరు (టూటౌన్):** ప్రైవేట్ ఫైనాన్స్ వ్యక్తులు పర్సనల్ లోన్ల పేరుతో భక్తుల డేటాను చోరీ చేయడాన్ని నిలువరించాలని బీజేపీ మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చలమల సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక దక్షిణపు వీధి జ్వాలా పహారేశ్వర స్వామి ఈఓకు ఫిర్యాదు చేశారు. గుడి గుమ్మం ముందు ప్రైవేట్ ఫైనాన్స్ వ్యక్తులు భక్తుల ఫోన్ నెంబర్లు తీసుకుని ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. ప్రశాంతత కోసం గుడికి వచ్చే భక్తులకు ఈ వ్యవహారం చాలా ఇబ్బందిగా మారిందన్నారు.

### నేడు యథావిధిగా సామాజిక పింఛన్ల పంపిణీ

**ఏలూరు(మెట్రో):** జిల్లాలో సామాజిక పింఛన్లను బుధవారం యథావిధిగా పంపిణీ చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నామని డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్.విజయరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పింఛన్ల పంపిణీ నిమిత్తం నగదును ఇప్పటికే బ్యాంకుల నుంచి పొందారని, అక్టోబర్,1 వ తేదీ ఉదయం 7 గంటల నుండి సచివాలయ సిబ్బంది పెన్షన్ల పంపిణీ చేపడతారని పేర్కొన్నారు. న్నారు. అనివార్య కారణాలు వల్ల ఆ రోజు పెన్షన్లు తీసుకొని వారికి సెప్టెంబరు 03న పంపిణీ చేస్తారని స్పష్టం చేశారు.

### విద్యార్థి చదువు కోసం ఆర్థిక సాయం

**దెందులూరు:** నియోజవర్గంలో గత విద్యా సంవత్సరం టెన్త్ టాపర్ కలగర హరిచరణ్ సాయి సీఏ కోర్స్ నిమిత్తం జాలిపూడి గ్రామానికి చెందిన నెక్సా జన్ కంపెనీ అధినేత అడుసుమిల్లి వెంకటసుబ్రహ్మణ్యం, నిర్మల దంపతులు రూ. 2.60 లక్షలు నగదును అందజేశారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామంలోని మమత ఉన్నత పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎస్ రాజు, ప్రిన్సిపల్ ఎస్ మమతా రాజు విద్యార్థి పరిస్థితిని సుబ్రమణ్యం దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన సుబ్రహ్మణ్యం సీఏ కోర్సు కొనసాగింపు నిమిత్తం రూ.2.60 లక్షలు అందజేశారని ఎస్ఎస్ రాజు మమత పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

### భానుడి ప్రకోపానికి భక్తులు విలవిల



చెట్టు నీడలో సేదతీరుతున్న భవానీ మాలధారులు

**ద్వారకాతిరుమల:** శ్రీవారి భక్తులు భానుడి ప్రకోపానికి భక్తులు విలవిలలాడారు. కొందరు మహిళా భక్తులు తలలపై చీర చెంగులు కప్పుకోగా, యువతులు చున్నీలను కప్పుకుని ఆలయ పరిసరాల్లో సంచరించారు. సెల్‌ఫోన్లు భద్రపరిచే కౌంటర్ వద్ద క్యూ కట్టిన భక్తులు తలలకు టోపీలు పెట్టుకోవడం, తుండ్లు, కర్చీఫ్‌లు కప్పుకోవడం వంటివి చేశారు. భవానీ దీక్షాధారులు చెట్లు కనిపిస్తే చాలు, వాటి కిందకు చేరి సేదతీరారు. జోరున వర్షం, లేదంటే భానుడి భగభగలు. గత కొద్ది రోజులుగా ఈ వింత వాతావరణంతో అటు ప్రజలు, ఇటు క్షేత్రానికి వచ్చే భక్తులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

# నిర్లక్ష్యం నీడలో ఏలూరు పెద్దాసుపత్రి

- అవస్థలు పడుతున్న గర్భిణులు, బాలింతలు
- ఎంసీహెచ్ పేరు చెబితేనే భయపడుతున్న వైనం



ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణం (ఫైల్)

**ఏలూరు టౌన్:** గత గర్భిణీ అక్కాచెల్లెమ్మలకు వైద్య సేవలు ఇంటివద్దకే అందేవి. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని గర్భిణుల ఇంటికి ఫ్యామిలీ డాక్టర్ వెళ్లి... పరీక్షలు చేసి మందులు ఇచ్చి మరీ వచ్చేవారు. ప్రసూతి సమయంలో ఎలాంటి టెన్షన్ లేకుండా ఏలూరు జీజీహెచ్‌లోని మాతాశిశు (ఎంసీహెచ్) కేంద్రానికి వెళితే... ప్రసూతి చేసి సురక్షితంగా తల్లీబిడ్డను చేరవేసేవారు. అనంతరం తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనంలో దర్జాగా ఇంటికి పంపేవారు. ఎక్కడా వైద్య అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది అలసత్వం ప్రదర్శించే పరిస్థితులు కనిపించేవి కాదు. ఉన్నతాధికారుల దృష్టికి వెళితే వేటు తప్పదనే భయం సిబ్బందిలో కనిపించేది. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేవి. కానీ జీజీహెచ్‌లోని ఎంసీహెచ్ విభాగానికి వెళ్లాలంటే గర్భిణులు, బాలింతలు వణికిపోతున్నారు. వైద్య అధికారులు, సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మహిళల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ప్రసూతికి వచ్చిన మహిళలకు ఆపరేషన్లు చేస్తుండగా కుట్లు సరిగ్గా వేయకపోవటంతో చీము పట్టటం, కుట్లు విడిపోవటం వంటి సమస్యలతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. తీవ్ర అనారోగ్యంతో ప్రాణాపాయ స్థితికి చేరే పరిస్థితులు ఎదురవుతున్నాయి. జిల్లాస్థాయి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హెచ్చరించినా తీరు మారడం లేదు.

**మహిళల ప్రాణాలతో చెలగాట**

జిల్లాలోని దెందులూరు నియోజకవర్గంలో ఒక మహిళ ఏలూరు జీజీహెచ్ ఎంసీహెచ్ విభాగంలో ప్రసూతికి వచ్చింది. ఆమెకు ఆపరేషన్ చేసి తల్లీబిడ్డను సురక్షితంగా వేరే చేశారు. ఇక్కడి వరకూ బాగానే ఉన్నా ఆపరేషన్ అనంతరం మహిళలకు కుట్లు వేయడంలో వైద్య అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఆమెకు వేసిన కుట్లు విడిపోవడంతో అనారోగ్యం బారిన పడింది. భయంతో వారు బయటకు వెళ్లి దెందులూరులోని ఒక హాస్పిటల్‌లో చికిత్స చేయించుకున్నారు. తీరా అక్కడికి వచ్చిన ప్రజాప్రతినిధికి జరిగిన విషయాన్ని చెప్పగా హాస్పిటల్ వైద్య అధికారులపై సీరియస్ అయ్యారు. కానీ ప్రయోజనం శూన్యం. రెండు రోజుల క్రితం లింగపాలెం ఎర్రంపల్లి గ్రామానికి చెందిన శిరీష అనే మరో మహిళ ప్రసూతి కోసం 20 రోజుల క్రితం ఎంసీహెచ్‌కు వస్తే... ఆపరేషన్ చేశారు. కుట్లు చీము పట్టి, ఇన్‌ఫెక్షన్ రావటం, కుట్లు విడిపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. కనీసం డిశ్చార్జ్ చేస్తే బయటకు వెళ్లి వేరే హాస్పిటల్‌లో వైద్య చికిత్స చేయించుకుంటామని చెప్పినా రెండు వారాల పాటు ఆమెను డిశ్చార్జ్ చేయకుండా ప్రాణాలతో చెలగాటం ఆడారు. గతంలోనూ పెదపాడు ప్రాంతంలో ఒక మహిళకు ఇదే సమస్య రావటంతో కలెక్టర్ విచారణ చేయించగా, వైద్య అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం బయటపడింది. ఇలాంటి సంఘటనలు నెలకు పదికి పైగా చోటుచేసుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

**ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటాం**



ఏలూరు సర్వజన ఆసుపత్రి ఎంసీహెచ్ విభాగంలో మహిళల ఆపరేషన్‌కు సంబంధించి కుట్లు విడిపోవటం, నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఘటనలపై ఆరా తీశాం. ఎంసీహెచ్ విభాగం వైద్య అధికారులతో సమీక్షించాం. అపరేషన్ల సమయంలో మరింత శ్రద్ధ, జాగ్రత్తలు పాటించేలా ఆదేశాలు జారీ చేశాం. కొన్ని సార్లు మహిళల ఆరోగ్యస్థితి, శారీరక పరిస్థితుల నేపథ్యంలో కుట్లు త్వరగా మానకుండా ఉండే స్వభావం ఉంటుంది. వందలో ఐదారు కేసుల్లో ఇలాంటి పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది.

– డాక్టర్ ఎంఎస్ రాజు, ఏలూరు జీజీహెచ్ సూపరింటెండెంట్

### అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యం



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతల రమేష్ బాబు

**ఏలూరు(టూటౌన్):** అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పనిచేయాలని పాలితులుగా ఉన్న మనమంతా పాలకులుగా మారాలని అప్పుడే అంబేద్కర్‌కు నివాళులర్పించాలని నేతల రమేష్ బాబు, దాసరి నాగేంద్రకుమార్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చింతా మహాలక్ష్మడు, వరిగంజి సర్వేశ్వర, బురకాయల రత్న రాజేష్, అందుగుల జ్యోతి, లావూరి సత్య వాణి, దారా శివకుమార్, శ్రీకుర్మం వెంకట రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓంకార రూపిణి.. శక్తి స్వరూపిణి



దుర్గాదేవి అలంకరణలో శనివారపుపేట కనకదుర్గమ్మ

నగరంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఉత్సవాల మంగళవారం వివిధ అమ్మవార్ల ఆలయాల్లో అమ్మవార్లకు విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు, విశేష హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేసి, అష్టోత్తర శతనామ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శనివారపుపేటలోని శ్రీ కనకదుర్గమ్మ, శ్రీ కాశీ అన్నపూర్ణసమేత విశ్వేశ్వరస్వామివారి ఆలయంలో, భావిశెట్టివారిపేటలో శ్రీ కనకదుర్గాంబ అమ్మవారు, పత్తేబాద శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు, సత్రంపాడులోని శ్రీ సౌభాగ్యలక్ష్మి అమ్మవార్లు శ్రీ మహాదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

– ఏలూరు (ఆర్ఆర్‌పేట)



కాశీ అన్నపూర్ణదేవి ప్రత్యేక అలంకరణ



ఆకట్టుకున్న భావిశెట్టిపేటలోని కనకదుర్గాంబ



ప్రత్యేకాలంకరణలో పత్తేబాద కనకదుర్గమ్మ



దుర్గాదేవి అలంకరణలో శ్రీసౌభాగ్య లక్ష్మి అమ్మవారు

## రాజకీయ పార్టీలు విశ్వాసంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్

**ఏలూరు (టూటౌన్):** తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తొక్కేస్తా ఉంటే మాల ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం అన్యాయమని నేషనల్ ప్రెసిడెంట్‌ఫర్ మాల మహానాడు అండ్ రాక్స్ డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. మంగళవారం ఏలూరులో విలేకరుల సమావేశంలో రత్నాకర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు విశ్వాసంగా ఉన్నారే తప్ప జాతి పట్ల విశ్వాసంగా లేరన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1108 ఎస్సీ కులాలకు ఎలా పంచుతారని ఈ నాలుగు సీట్లను తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలకు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఎలా పంచుతారని, ఇది దళితుల ఐక్యతపై కుట్ర కాదాఅన్నారు. కులం ఉనికి కోల్పోకుండా శాంతియుతంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో కీర్తి నారాయుడు, ఈదూరి గంగరాజు, నంబూరు వరప్రసాద్, తుమ్మల ఫ్రాన్సిస్ , కొప్పుల ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతకు పటిష్టమైన చర్యలు



మహిళలకు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఏలూరు మహిళా స్టేషన్ ఎస్సై, శక్తి టీమ్ సభ్యులు

**ఏలూరు టౌన్:** నగరంలో మహిళలు, యువతులు, విద్యార్థినుల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామనీ, ముఖ్యంగా మహిళలు మహిళా చట్టాలపై, రక్షణపై అవగాహన కలిగి ఉండాలని ఏలూరు మహిళా స్టేషన్ ఎస్సై నాగమణి తెలిపారు. ఏలూరు మహిళా స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో ఏలూరు వన్‌టౌన్ జ్వాలాపహరేశ్వర స్వామి దేవాలయంలో ఏలూరు శక్తిటీమ్ సభ్యులు మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు అత్యవసర స్థితిలో తమ భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. 181 మహిళల హెల్ప్‌లైన్ నెంబర్‌కు గృహ హింస, వేధింపులు, లైంగిక దాడులపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. శక్తి యాప్ నెంబర్ 7993485111కు అత్యవసర సమయాల్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. శక్తి యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ నొక్కటం ద్వారా వెంటనే మీ సమాచారం తెలియడంతోపాటు, లోకేషన్ సైతం పోలీసులకు తెలుస్తుందని, వెంటనే పోలీస్ సిబ్బంది మీకు అండగా నిలుస్తారని తెలిపారు.

# రాజకీయాలు ఆదర్శవంతంగా ఉండాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**దెందులూరు:** వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సూచన మేరకు అశోక్ నగర్‌లోని ఆయన కార్యాలయంలో మంగళవారం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ వాల్ పోస్టర్లను వైఎస్సార్ సీపీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్ మాట్లాడుతూ రాజకీయాలు ఆదర్శవంతంగా స్ఫూర్తిదాయకంగా చేయాలే తప్ప కక్షపూరితంగా అభివృద్ధికి విఘాతంగా ఉండకూడదన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఐదు సంవత్సరాలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేశారన్నారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో కోత విధిస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, దెందులూరు ఎమ్మెల్యేగా కొఠారు అబ్బయ్య చౌదరి విజయం తథ్యమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అన్యాయం జరిగితే డిజిటల్ బుక్‌లో తమ పూర్తి వివరాలు నమోదు చేసుకోవచ్చన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్ మాట్లాడుతూ 16 నెలల కూటమి పాలనలో దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు ప్రజలు గమనిస్తున్నారన్నారు. గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి కట్టా ఏసుబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. పార్టీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు మేక లక్ష్మణరావు మాట్లాడుతూ పార్టీ అన్ని విభాగాల నాయకులు కార్యకర్తలు అభిమానులకు డిజిటల్ బుక్ రక్షణగా నిలుస్తుందన్నారు. ఏలూరు జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, జడ్పీటీసీలు నిట్టా లీలా నవకాంతం, మండల సరస్వతి కొండలరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గంగరాజు, బండ్ల విజయకుమార్, జిల్లా కార్యదర్శి మట్ట రవి శంకర్ గౌడ్, వైఎస్సార్ సీపీ నాయకులు భక్తుల రత్నకుమారి, తేజ, బాపనయ్య, బత్తుల ఏసురాజు, కొరపాటి ప్రభుదేవా, తలారి రామకృష్ణ, పులవర్తి దేవానంద్, ముని, గారపాటి నాగేశ్వరరావు, గంట పండు తదితరులు పాల్గొన్నారు.

## పరిమి సావిత్రికి సంగీత పురస్కారం



పరిమి సావిత్రిని సత్కరిస్తున్న కేవీ సత్యనారాయణ

**ఏలూరు(టూటౌన్):** సంగీతం టీచర్‌గా విద్యార్థులకు శిక్షణ ఇస్తు పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇస్తూ ఎనలేని సేవలందించిన పరిమి సావిత్రిని కేవీ సత్యనారాయణ అభినందించారు. మంగళవారం దేవి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఏలూరు వేద పాఠశాల్లో ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో కేవీఎస్‌ట్రస్ట్ ప్రముఖ సంగీత కళాకారిణి పరిమి సావిత్రిని సత్కరించారు. ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడుతూ కేవీఎస్ సంగీత పురస్కారం అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కేవీఎస్ శాలువా, పురస్కార అవార్డు, నగదుతో సావిత్రి సత్కరించారు. కార్యక్రమంలో డీవీ రమణ, ఎల్.వెంకటేశ్వరరావు, పుల్లాబొట్ల పురుషోత్తం, కళారత్న పార్వతి రామచంద్రన్, సీనియర్ కళాకారులు తాడిమేటి శుభ, వేదుల జయలక్ష్మి, డీ.శైలజ, మధురిమ, గంగాభవాని, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన చట్టాలను అమలు చేయాలి

**బుట్టాయగూడెం:** భూ అక్రమ లావాదేవీలపై చర్యలు తీసుకొని గిరిజన చట్టాలను పగడ్బందీగా అమలు చేయాలని జాతీయ ఆదివాసీ సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కారం గంగాధర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల భూములను గిరిజనేతరులు కొనుగోలు చేయడం నిషేధం. అయినప్పటికీ కొంత మంది గిరిజనేతరులు మైదాన ప్రాంత గిరిజనులను బినామీలుగా పెట్టి అసైన్‌మెంట్, సీలింగ్ భూములు, గిరిజనేతర కబ్జాలో ఉన్న గిరిజనుల భూములను ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపించారు.

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 25 |
| ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర) | 21.30 | 21 |
| ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి) | 22.00 | 37 |
| ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్) | 22.30 | 14 |
| ఏలూరు – అమరావతి (ఇంద్ర) | 19.00 | రద్దు |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు –బీహెచ్ఈఎల్ | 21.45 | 4820 | 21 |
| ఏలూరు –బీహెచ్ఈఎల్ | 21.15 | 4822 | 18 |
| ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 21 |
| ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం | 10.45 | 4798 | 23 |
| ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం | 21.15 | 4802 | 20 |
| ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 22 |
| ఏలూరు –ఈసీఐఎల్ | 22.30 | 4814 | 22 |
| ఏలూరు – తిరుపతి | 16.00 | 4830 | 32 |

# తలకెక్కడం లేదు..

- వాహన చోదకుల్లో రాని మార్పు
- హెల్మెట్ వాడకంపై నిర్లక్ష్య ధోరణి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివాజీ

**దెందులూరు:** రహదారి ప్రమాదాల సంఖ్యను తగ్గించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు ముమ్మరం చేశాయి. అందులో భాగంగానే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలీస్ శాఖ నిర్ణయించింది. వాహన రిజిస్ట్రేషన్లకు హెల్మెట్ లింక్ తప్పనిసరి చేసింది. కానీ హెల్మెట్ వాడకంపై ద్విచక్ర వాహనదారులు లైట్ తీసుకుంటున్నారు. సెక్షన్ 129 ప్రకారం హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్న నిబంధనకు అలవాటు పడటం లేదు. అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించినా ఫలితం లేదు. గతంలో ప్రభుత్వం హెల్మెట్ లేకుండా పెట్రోల్ పోయొద్దని బంక్ యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ ఈ విధానం ఎక్కడా అమలు కాలేదు.

**కలవరపెడుతున్న రోడ్డు ప్రమాదాలు**

పట్టణం, గ్రామం అనే తేడా లేకుండా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు కలవరపెడుతున్నాయి. ప్రధానంగా హైవే రోడ్ లో జరుగుతున్న ప్రమాదాలు ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. హెల్మెట్ ధరించి ఉంటే గాయాలతో బయటపడవచ్చిని రోడ్డు భద్రతా సిబ్బంది అంటున్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు మాత్రమే స్పాట్‌లో మృతి చెందుతున్నారు.

**నాణ్యత లేని హెల్మెట్లతో..**

పోలీసుల నుంచి తప్పించుకోవడానికి నాణ్యత లేని హెల్మెట్లను కొనుగోలు చేయడం వలన ప్రయోజనం లేకపోగా ప్రమాదమే అధికమని అధికారులు సూచిస్తున్నారు. ఫుట్ పాత్‌లపై లభించే హెల్మెట్ల వలన ధర తగ్గుతుందని ప్రాణ రక్షణకు కనీస గ్యారంటీ ఉండదని చెబుతున్నారు. చిన్న ప్రమాదాల్లో వాహన చోదకుడు కింద పడితే హెల్మెట్ పగిలి వాటి వలన గాయాలు అయిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

**విస్తృత ప్రచారం అవసరం**

హెల్మెట్ వాడకంపై ప్రచారం పెంచాలి. ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయాలి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థ ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగం చేసేలా చర్యలు తీసుకోవాలి పాఠశాలలు కళాశాలలో హెల్మెట్లు వాడకంపై విరివిగా అవగాహన కల్పించాలి.